ప్రజాశక్తి
సోమవారం 5 జనవరి 2026
5



అల్లూరి సీతారామరాజు



పోలవరం



విశాఖ నగరంలో సాగుతున్న భారీ కార్మిక ప్రదర్శన

ఎర్ర సముద్రం



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై కరీం, సుదీప్ దత్తా, హేమలత

- జెండాలు ఎత్తిపట్టి కదిలిన కార్మిక సైన్యం
- ఉత్తేజం నింపిన సిఐటియు అఖిల భారత మహాసభ
- మహాప్రదర్శన, బహిరంగ సభకు పోటెత్తిన జనం
- బలమైన ఐక్య పోరాటాలకు నేతల పిలుపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరం 'ఎర్ర సముద్రం'గా మారింది. ఎటు చూసినా ఎర్రజెండాలే కానవచ్చాయి. వేలాదిగా కార్మికులు, ప్రజలు తరలివచ్చారు. కార్మిక పండగలో భాగస్వాములయ్యారు. విశాఖ నగరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. మహా ప్రదర్శన విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని ఎల్‌ఐసి బిల్డింగ్ పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైంది. భారీగా కదిలొచ్చిన కార్మిక దండుతో డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, డాల్ఫిన్ హోటల్, పూర్ణా మార్కెట్, వెలంపేట మీదుగా నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియానికి చేరుకుంది. అక్కడ భారీ బహిరంగ సభ జరిగింది. మహా ప్రదర్శన అగ్రభాగాన రెడ్ డ్రస్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎర్రజెండాలతో అలంకరించిన వాహనం పై నుంచి సిఐటియు అగ్ర నాయకులు నగర వాసులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మహా ప్రదర్శనకు ఎక్కడికక్కడ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. మహా ప్రదర్శన జరిగిన ప్రాంతమంతా 'కార్మికుల ఐక్యత వర్థిల్లాలి, అప్ అప్ సోషలిజం వంటి నినాదాలు హోరెత్తాయి. నగరంలో ఏ దారిలో చూసినా ఎర్రజెండా పట్టుకుని ఇందిర ప్రియదర్శిని స్టేడియంవైపు కదులుతున్న కార్మికులే కానవచ్చారు.

ప్రైవేటీకరణ, మతతత్వ విధానాలను తిప్పికొట్టాలి : నేతల పిలుపు


బహిరంగ సభలో సిఐటియు అఖిల భారత నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదీప్ దత్తా, కరీం మాట్లాడుతూ కార్మికవర్గం దేశంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ముందడుగు వేయడం తప్ప వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. దేశంలోని అన్ని తరగతుల కార్మికుల సమస్యలపైనా సిఐటియు పోరాడుతుందన్నారు. దేశమంతటా నిర్బంధం పెరుగుతోందని, సిఎంలు, మంత్రులు కార్మిక నాయకులను కలవనివ్వడం లేదని, హౌస్ అరెస్టులకు తెగబడుతున్నారని తెలిపారు. కార్మికవర్గాన్ని శత్రువుగా చూస్తున్నారని మండిపడ్డారు. కార్మిక శక్తిని ప్రభుత్వాలకు చూపాలంటే ఐక్యపోరాటాలు పెరగాలన్నారు. సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు తపన్ సేన్ మాట్లాడుతూ విశాఖలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ఎలా బలహీనం చేయాలని చూస్తుందో వివరించారు. ప్రైవేటీకరణ, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని కొనియాడారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే కుట్రలపై పోరాడుతున్న విశాఖ కార్మికవర్గం మంచి తెగువను చూపుతోందన్నారు. మరిన్ని సమరశీల ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ సిఐటియు మహాసభలో దేశ వ్యాప్తంగా 1350 మంది ప్రతినిధులు పాల్గొన్నారని, భవిష్యత్ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఫిబ్రవరి 12న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సంపద సృష్టించే కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మిక అనుకూల విధానాలు, సంక్షేమంలో వెనిజులా, క్యూబా వంటి దేశాలు, మన దేశంలోని కేరళ ఎంతో ఆదర్శమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సిఐటియు ఎలా అడ్డుకున్నదీ వివరించారు.



శిథిలావస్థకు చేరుకున్న పట్టు పరిశ్రమ భవనం

'పట్టు' కోల్పోయిన 'పరిశ్రమ'

- మూతబడిన కార్యకలాపాలు
- శిథిలావస్థకు చేరుకుంటున్న భవనాలు
- అరణ్యరోదనగానే గిరిజనుల మొర



భవనం చుట్టూ అడవిలా పెరిగిపోయిన చెట్లు

ప్రజాశక్తి-చింతపల్లి : ఒకప్పుడు గిరిజనులకు ఉపాధి, మహిళలకు స్వయం ఉపాధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలిచిన చింతపల్లి పట్టు పరిశ్రమ నేడు పూర్తిగా పట్టు కోల్పోయే స్థితికి చేరుకుంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన పట్టు పరిశ్రమ భవనాల నిర్వహణ లేక అడవుల్లో కలిసిపోతూ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనాలుగా మారాయి. పొదలు, చెట్ల మధ్య పాడుబడి పోయిన పరిశ్రమ యూనిట్లను చూసి స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టు పురుగుల పెంపకం, కోకూన్ ఉత్పత్తి, సిల్క్ నూలు తయారీ వంటి కార్యకలాపాలతో ఒకప్పుడు కిటకిటలాడిన ఈ కేంద్రాలు ప్రస్తుతం పూర్తిగా మూతపడ్డాయి. భవనాల చుట్టూ విపరీతంగా పెరిగిన పొదలు, కూలిపోతున్న పైకప్పులు, నిరుపయోగంగా మారిన ప్రాంగణాలు పరిశ్రమ పతనాన్ని స్పష్టంగా చాటుతున్నాయి.

ఈ పట్టు పరిశ్రమల్లో ప్రస్తుతం ఉద్యోగులు ఉన్నారా? లేరా? అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టు పరిశ్రమ ద్వారా గిరిజన యువతకు స్థిర ఉపాధి, మహిళలకు ఇంటి వద్దే ఆదాయం, వ్యవసాయానికి అనుబంధంగా అదనపు లాభం లభించేది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం అందించే, పర్యావరణానికి హాని లేని పరిశ్రమగా పట్టు రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచింది. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాల లోపంతో ఈ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టు పరిశ్రమ నిలిచిపోవడంతో వందలాది గిరిజన కుటుంబాలు జీవనోపాధి కోసం మైదాన ప్రాంతాలకు వలస బాట పట్టాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాల్సిన పరిశ్రమలు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పట్టు పరిశ్రమ భవనాలు అక్రమాలకు కేంద్రాలుగా మారే ప్రమాదం ఉందని, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఏమైపోయారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టు పరిశ్రమకు చెందిన విలువైన భూములు అక్రమాలకు గురయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందని హెచ్చరిస్తున్నారు. పట్టుపరిశ్రమకు పూర్వవైభవానికి అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీసం భవనాల సంరక్షణ కూడా చేపట్టకపోవడం వల్ల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు నాశనం అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి పట్టు పరిశ్రమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చింతపల్లి పట్టు పరిశ్రమను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పట్టు పురుగుల పెంపకానికి శిక్షణ, ముడిసరుకు సరఫరా, మార్కెట్ సౌకర్యాలు కల్పించి గిరిజన యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలని గట్టిగా కోరుతున్నారు.

పశుశాలలు కాదు..పాఠశాలలే..!

- జికె వీధి మండలం వలసపల్లి, గంగవరం మండలం రాజుపేటలొద్ది ఎంపిపి పాఠశాలల దుస్థితి
- పునాదుల దశలో..పాఠశాలల భవనాలు
- పట్టించుకోని అధికారులు..



రాజుపేటలొద్దిలో పాఠశాల

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని రాజుపేటలొద్దిలో ఎంపిపి పాఠశాలకు సరైన భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ఉపాధ్యక్షుడు కే.బాపన్నదొరను ఈ విషయమై సంప్రదించగా నాడు నేడు-ఫేజ్ 2 లో భాగంగా భవనం మంజూరు చేసినప్పటికీ పునాది దశలోనే పనులు నిలిచిపోయాయన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటి వరకూ సరైన భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వర్షాకాలం, వేసవిలో పిల్లలకు తరగతులు బోధించేందుకు ఇబ్బందిగా ఉంది. భద్రతా సమస్యలు కూడా ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే శాశ్వత భవనం మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.



వలసపల్లిలో ఎంపిపి పాఠశాల

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి గ్రామంలో శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులు తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రేకులషెడ్‌లో చదువుతున్నారు. వలసపల్లి, మునసుపల్లి గ్రామాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ప్రస్తుతం సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపు ఎంపిపిస్కూల్లో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ అనే ఉపాధ్యాయుని వలసపల్లి ఎంపిపి పాఠశాలకు డిప్యూటేషన్ ప్రాతిపదికన అధికారులు నియమించారు. ప్రస్తుతం ఆయన విద్యాబోధన చేస్తున్నారు. పిల్లలు చదువుకునేందుకు సరైన తరగతి గది కూడా లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ పిల్లలు తలరాతలు మారడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత 30 సంవత్సరాల నుంచి వలసపల్లిలో పక్కా స్కూలు భవనం లేక తాత్కాలికంగా వేసిన రేకుల షెడ్డులో విద్యార్థులు వర్షానికి తడుస్తూ, ఎండకి ఎండుతూ సతమతమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. 2020లో సర్వశిక్ష అభియాన్ నిధులు మంజూరు చేశారు. అప్పట్లో కాంట్రాక్టర్ రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల వివిధ కారణాల వల్ల పనులు నిలిపేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఒ అధికారులు స్పందించి శాశ్వత భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూరి పాకలోనే తరగతులు



పాఠశాలకు సరైన భవనం లేక పూరి పాకలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే కారిపోతోంది. త్వరగా భవన నిర్మాణపనులు పూర్తి చేయాలి

- తాటి రవి, గ్రామస్తుడు

అధికారులు స్పందించాలి



నా పిల్లలు ఇక్కడే చదువుతున్నారు. చలికాలం కావడంతో సరైన పాఠశాల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి.

- తాటి బాపనమ్మ, స్కూల్ చైర్మన్



వలసపల్లిలో నిర్మాణంలో నిలిచిపోయిన పాఠశాల భవనం

ఉపాధ్యాయులు సరిగ్గా హాజరు కావాలి



ప్రతిరోజు ఉపాధ్యాయులు విధులకు సరిగ్గా హాజరు కావాలి. విద్యార్థులు వస్తున్నా ఉపాధ్యాయులు సరిగ్గా రాకపోవడంతో రోడ్డుపై ఆడుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మజ్జి గిన్ను, వలసపల్లి

అధికారుల పర్యవేక్షణ అవసరం



ఉపాధ్యాయులు అంకితభావంతో విధి నిర్వహణ చేపట్టాలి. ఉపాధ్యాయులు సరిగా వస్తున్నారో లేదో అనే విషయమై అధికారులు పర్యవేక్షించాలి.

- కిమ్ముడు లక్ష్మి, వలసపల్లి

పిల్లల భవిష్యత్తుపై ఆందోళనగా ఉంది



మా పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. పాఠశాలలో చదువు చెప్పేవారు లేక విద్యకు దూరమవుతున్నారు. పిల్లలు భవిష్యత్తు తీర్చిదిద్దేలా అధికారులు దృష్టి సారించాలి

- మధ్య ప్రమీల, వలసపల్లి



కార్యాలయంలో పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

- వట్టిగెడ్డ కేంద్రంగా నిర్వహణ
- యథాతథంగా రంపచోడవరం కార్యాలయం
- ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో క్యాంపు కార్యాలయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం రీత్యా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంపచోడవరం క్యాంపు కార్యాలయం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ అంతా నూతన కార్యాలయం నుండే అమలుచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం విజయ్ భాస్కర్, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం స్థానిక ఎపి జెన్కో కళ్యాణ మండపంలో గత నెల 21వ తేదీన నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో డిఎవి, ఎపి గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్, బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆదివారం రామాలయం సెంటర్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి జెన్కో ఇఇ రాజేంద్రప్రసాద్ ఎంపిటిసి సాంబమూర్తి బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగశకుంతల హాజరయ్యారు. 'మత్తు పదార్థాలు దుష్పరిమాణాలు'- 'నేటి బాలలే రేపటి పౌరులు' బలోపేతం చేయడం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి నరేంద్ర ప్రథమ స్థానంలో నిలిచారు. అతనికి రూ.1500 నగదు అందజే శారు. ద్వితీయ స్థానంలో నిలిచిన డిఎవి విద్యార్థిని మీనాక్షికి రూ.1000లు, తృతీయ స్థానం సాధించిన నశ్రీన్‌కు 500 రూపాయలు, నాలుగో స్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థి కైలాంగ్ లలిత, ఐదో స్థానంలో నిలిచిన సుశాంత్ కుమార్‌లకు బహుమతులతో పాటు ప్రతిభ సర్టిఫికెట్లు ఇఇ రాజేంద్రప్రసాద్, వార్డెన్ నాగశకుంతల అందజేశారు. పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఐ యాసీను, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వారపు సంత

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండ వారపు సంత ఆదివారం జనాలతో కిక్కిరిసింది. పుష్యమాసంలో గిరిజనులు వారి ఆచార సంప్రదాయాల ప్రకారం ప్రతి ఏడాది సంక్రాంతి ముందు నుంచే జరుపుకుంటారు. వారికి కావలసిన పండ్లు కూరగాయలు, దుస్తులు, సామాగ్రి కొనుగోలు చేసి అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. వారపు సంతకు గుమ్మిరేవుల, దుప్పిలివాడ, ధారకొండ పంచాయతీ పరిధి గ్రామాలనుంచి గిరిజనులు తరలివచ్చారు. దుస్తులు పండక్కి కావలసిన సామాగ్రి కొనుగోలు చేశారు. దుస్తులు, ఫ్యాన్సీ సామాగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎస్సై యాసీన్ ట్రాఫిక్ నియంత్రించారు.



సీలేరు: వారపు సంతలో దుకాణాల వద్ద కిక్కిరిసిన కొనుగోలుదారులు

కొలతలు, తూనికల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం వారపు సంతను ఆదివారం మంప ఎస్సై సీదరి శ్రీనివాస్ సందర్శించారు. వారపు సంతకు వచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారపు సంతల్లో నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. తప్పుడు తూనికలు, కొలతలు వేయవద్దని వ్యాపారులకు సూచించారు. నిల్వ వస్తువుల విక్రయం, అధిక ధరలు, కొలతలు, తూనికల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చీరలు పంపిణీ చేస్తున్న కృపాభారతి ట్రస్టు చైర్మన్ కృపారావు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలో విఆర్‌పురం గ్రామంలో బిసి కాలనిలో ఉన్న కృపా భారతి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ అండ్ చెర్మెన్ కృపారావు చేతుల మీదుగా బిసి కాలనిలో ఉన్న ట్రూత్ ఇవాంజిలికల్ చర్చి ఆవరణంలో పేదలకు 80 కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చెర్మెన్ కృపారావు మాట్లాడుతూ గతంలో చారిటబుల్ ట్రస్టు ద్వారా ఐదు గ్రామాల ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెక్రటరీ భారతి, ట్రూత్ ఇవాంజిలికల్ చర్చి కోఉపాస్టర్స్, కమిటీ పెద్దలు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- జి.మాడుగుల:వాహనదారులు రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై సాయిరాం పడాల్ తెలిపారు. జి.మాడుగులలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికెట్ వంటి రికార్డులు తమ వద్ద కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ఓవర్‌లోడింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఎస్సై స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు 6లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- పెదబయలు :ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనకు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఈ నెల 6న సాయంత్రం ఐదుగంటల్లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి హామీ ఎపిఒ సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో సిఎస్‌డిడి యుజికెవై ద్వారా కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్ లాజిస్టిక్, ఇతర రంగాలలో శిక్షణనిచ్చి, ప్రముఖ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో ఉచితంగా భోజన వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉన్నతి ద్వారా శిక్షణ కాలంలో రోజుకు రూ.307 స్టైపండ్ చెల్లింపు, వంద శాతం ఉద్యోగాలు కల్పించే అవకాశాలున్నాయని తెలిపారు. మండలంలో కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నేరుగా కుల పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, బిటెక్ ఉత్తీర్ణులైన 18ఏళ్లు నిండిన ఆధార్, రేషన్‌కార్డు జిరాక్సులు జతపరిచిన దరఖాస్తులను మంగళవారం సాయంత్రంలోగా అందజేయాలని ఎంపిఓ సూరిబాబు సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ, జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత, సహాయ కార్యనిర్వహణాధికారి వాడ్రేవు రమణమూర్తి, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేద పండితులు నాదస్వర మేళతాళాల నడుమ, వేదమంత్రోచ్ఛారణలతో వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ ప్రవేశం చేయించారు. అనంతరం వారంతా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలోని శ్రీ వరాహలక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి విశిష్టతను వారికి వివరించారు. ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో వారిని సత్కరించారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. అప్పన్నను దర్శించుకున్న పార్లమెంట్ కమిటీ సభ్యుల్లో భరత్ భాయ్ సుతారియా దంపతులు, యోగ్యేందర్ సింగ్ దంపతులు, డాక్టర్ కె.లక్ష్మణ్ దంపతులు, నరహరి అమీన్, అజీర్ ముమ సిడి, జలజిద్ మారియ, దామోదర్ అగర్వాల్, దీపక్ శిష్ పార్కెర్, కాలిల్ జి రాఠార్, సుఖాషిష్ ఖుంటి, కౌశలేంద్ర కుమార్, సుదామ ప్రసాద్, ఉమ్మేద్ రామ్ బెనివాల్ పాల్గొన్నారు.

తారుమారు సంతకు ఏర్పాట్లు


ఏర్పాట్లకు పనులు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మణికుమారి

ప్రజాశక్తి-జి.మాడుగుల: జి.మాడుగులలో ఈ నెల 6, 13వ తేదీల్లో రెండు మంగళవారాలు నిర్వహించనున్న తారుమారు సంతకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, స్థానిక సర్పంచ్ రాంబాబు, ఎంపిటీసీ సభ్యులు విజయకుమారి, సంత నిర్వాహకుడు ఎం. నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు ముందు జి.మాడుగులలో తారుమారు సంత నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సంతకు పరిసర గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో వ్యాపారులకు సరైన స్థలాల కేటాయింపు, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, భద్రత వంటి అంశాలపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులు, చిన్న వ్యాపారులకు ఇది ఆదాయ వనరుగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. సంతను విజయ వంతంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. సంతలో ఎటువంటి ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా మళ్లిస్తున్నట్లు తెలిపారు. చింతపల్లి నుంచి వచ్చే వాహనాలు నుర్మతి రహదారి, క్రషర్ మీదుగా ఈదుల బయలు జంక్షన్ నుండి పాడేరు ప్రధాన మార్గానికి చేరుకోవాలని, పాడేరు నుంచి చింతపల్లి వెళ్లే వాహనాలు ఈదులు బైలు నుంచి సింగర్బ మీదుగా తహసిల్దార్ కూడలికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణమూర్తి రాజు, లక్ష్మిపతిరాజు, బాబూరావు, జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడే మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక

ప్రజాశక్తి -అనంతగిరి: ఈనెల 5న జరిగే అనంతగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు ఏర్పాట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా జెసి, స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారి పరిశీలించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి నీలవేణి అవిశ్వాస తీర్మానంలో పదవి కోల్పోవడంతో గత పది రోజుల క్రితం రాష్ట్ర పంచాయతీరాజ్ ఎన్నికల కమిషన్ వైస్ ఎంపిపి బాడా .శకుంతలకు ఇన్‌ఛార్జ్ ఎంపిపిగా బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో నేడు పూర్తిస్థాయి కొత్త మండల పరిషత్ అధ్యక్ష పదవి ఎన్నికకు ఆదేశాలు జారీ చేశారు. నేడు మండల పరిషత్ కార్యాలయంలో జరుగు ఎంపిపి ఎన్నికకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జెసి, స్థానిక ఎంపిడివో పేర్కొన్నారు. ఈ ఎన్నికకు మండలంలో ఉన్న 14 పంచాయతీ ఎంపిటీసీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


అధ్యక్ష ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆలిండియా యూనివర్సిటీ స్థాయి..

రెజ్లింగ్ పోటీలకు చింతపల్లి విద్యార్థులు


జాతీయ పోటీలకు ఎంపికైన చింతపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఆలిండియా యూనివర్సిటీ స్థాయి రెజ్లింగ్ పోటీలకు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. కాలేజీకి చెందిన బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ థర్డ్‌ఇయర్ విద్యార్థి సిహెచ్.మహేష్, బిఎ సెకెండియర్ విద్యార్థి వి.మహేష్, బిఎ హిస్టరీ ఫస్టియర్ విద్యార్థి జె.జీవన్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి, ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధం చేయడంలో కృషి చేసిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. శివరాంకుమార్‌ను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి పతకాలను సాధించం ద్వారా కళాశాలకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అనంతగిరి :మండలంలోని చిలకల గెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామ సమీప మలుపు వద్ద ఆదివారం వ్యాను, బైకు ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్.కోట నుండి అరకు వెళ్తున్న వ్యాను, అరకు నుండి విశాఖ వస్తున్న బైక్ ఢీ కొన్నాయి. బైక్‌పై వెళుతున్న మణికంఠ మృతి చెందాడు.స్థానిక పోలీసులు సంఘటన స్థలంలో చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు వేస్తున్నారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్ కోట ప్రభు తో ఏరియా ఆసుపత్రికి తరలించారు,

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ శివారున చెరుకు కాటా వద్ద ఆదివారం ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు బుచ్చయ్య పేట ఎస్ఐ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి గవరపాలేనికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారన్నారు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలో దిబ్బిడి గ్రామానికి చెందిన పెద్దిరెడ్ల పోతురాజు (45) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కూలి పని కోసం గత నెల 26న సబ్బవరం సమీపంలో గల వంగలి వద్ద సరుగుడు చెట్లు కొట్టడానికి వెళ్లి, పోతురాజు, ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగాచోడవరం బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ వద్ద లారస్ కంపెనీకి చెందిన బస్సు, ఢీకొంది. ఈ ప్రమాదంలో ఫోతురాజు రెండు కాళ్లపై నుండి బస్సు వెళ్లిపోవడంతో విశాఖ కేజిహెచ్‌లో వైద్యానికి చేర్చగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇంటి యజమాని మతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నేరుగా వినిపిస్తున్నారు. మృతునికి అంథురాలైన తల్లి, భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: మండలంలోని ఓఎల్.పురం, గదబపాలెం గ్రామ శివారులో నాటు సారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. డీఎస్పీ పీ.శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నర్సీపట్నం రూరల్ ఎస్సై పి.రాజారావు ఆదివారం తన సిబ్బందితో సారా తయారీకి ఉపయోగించే 3200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు.

కారు బోల్తా పడి ఒకరు మృతి

ప్రజాశక్తి- పద్మనాభం : అనంత పద్మనాభం దర్శనం పూర్తిచేసుకుని కిందికి వస్తున్న కారు ఘాట్ రోడ్డులో మలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న జీడి తోటలోకి దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో నర్సీపట్నానికి చెందిన జి.ప్రసాదు (31) మృతిచెందారు. నర్సీపట్నం, రామారావు పేటకు చెందిన ఏడుగురు కారులో దర్శనానికి వచ్చి, తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో పారి కిరణ్ (27), పారి హరిహరణ్ (9), పారి అనూష (27), పారి సుప్రియ (27), పారి ఆదిత్య (33), పారి సమన్వయం (6) స్వల్ప గాయాలపాలయ్యారు. పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారిని విజయనగరం మహారాజా హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్‌బిటి హోటల్‌లో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎస్‌బిటి హోటల్‌లో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... శ్రీనగర్‌కఉ చెందిన ముదునూరు మోహనరాజు (40) నేవల్ డాక్‌యార్డులో కాంట్రాక్టు పనులు చేస్తుండేవాడు. గత కొంతకాలం క్రితం షేర్స్‌లో డబ్బులు పెట్టి రూ.40 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇంట్లో ఉన్న బంగారాన్ని అమ్మి అప్పులు తీర్చారు. ఇవన్నీ మనసులో పెట్టుకొని మానసికంగా బాధపడుతూ ఎస్‌బిటి హోటల్లో శనివారం రాత్రి రూము తీసుకున్నారు. రాత్రి 1:00 సమయంలో ఉరేసుకున్నారు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

డిసిసి అధ్యక్షునిగా బుల్లిబాబు నియామకంపై హర్షం

ప్రజాశక్తి-సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బుల్లిబాబుని ఎంపిక చేయడంపై సీలేరు, దుప్పిలివాడ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీలేరులో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ రెండోసారి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బుల్లిబాబుని ఎంపిక చేయడం శుభపరిమాణం అన్నారు. అదే విధంగా గిరిజన ప్రాంతంలో నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలను నియమించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధిష్టానాన్ని కోరారు. స్థానిక ఎన్నికలకు దృష్టిలో పెట్టుకుని పార్టీ పెద్దలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, సీలేరు పంచాయతీ టౌన్ అధ్యక్షులు వానపల్లి అప్పారావు, ఉపాధ్యక్షులు మైలుపల్లి సత్తిబాబు, ఆలంగి రాజు, మండల అధ్యక్షులు సొన్ను, ధారకొండ పంచాయతీ అధ్యక్షులు మల్లుదొర, ఉపాధ్యక్షులు చిన్నబ్బాయి, గుమ్మిరేవుల పంచాయతీ అధ్యక్షులు పూజారి బాబురావు, ఉపాధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


దేవీపట్నం నుంచి బయలుదేరుతున్న బోటు

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

- ఆరు బోట్లలో 343 మంది పర్యాటకులు

దేవీపట్నం-ప్రజాశక్తి: పాపికొండల విహారయాత్రకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. దేవీపట్నం మండలం నుంచి పాపికొండలకు ఆరు బోట్లలో 343 మంది పర్యాటకులు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న బోట్ పాయింట్ నుంచి బోట్లు ప్రతిరోజూ వెళ్తాయని తెలిపారు. పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, బోటులో ఉన్న వారందరికీ లైఫ్ జాకెట్లు ఇచ్చినట్టు తెలిపారు. ఉదయం వెళ్లిన బోట్లు సాయంత్రానికి తిరిగి వస్తాయని తెలిపారు.

వైసిపి నేత ఎల్లాజీకి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ వైసిపి 32వ వార్డు సీనియర్ నాయకుడు గరికిన ఎల్లాజీకి వైద్య ఖర్చులకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు గణేష్‌కుమార్ ఆదివారం ఎలాజీ ఇంటికి వెళ్లి పరామర్శించి సాయం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ భాను మూర్తి, కోటి తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభకు తరలి వెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి-రాజవమ్మంగి: సిఐటియు జాతీయ మహాసభల నేపథ్యంలో విశాఖపట్నంలో ఆదివారం మహాసభ చివరి రోజున మునిసిపల్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభకు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వాణిశ్రీ, పల్లపు వెంకట్, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ పి.రామరాజు, కె.శాంతిరాజు,టి.శ్రీను, సీసం సురేష్, పి.లక్ష్మణ్, రాజేశ్వరి, బి.నిర్మల,కె రాణి, తీగల శ్రీనివాస్‌తో పాటు సుమారు 2000 మందికి పైగా అంగన్‌వాడీ, ఆశ, వెలుగు యానిమేటర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ, బిల్డింగ్‌వర్కర్స్ తదితర రంగాల చెందిన కార్మికులు తరలి వెళ్లారు. రంపచోడవరం నియోజకవర్గం కళాకారులు ప్రదర్శించిన కొమ్ము, డోలికొయ్యల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బహిరంగ వక్తల ప్రసంగాలు ఆలోచింపచేసాయి. నూతన ఉత్తేజన్నీ నింపాయి.

పాడేరు: విశాఖలో సిఐటియు అఖిల భారత మహాసభకు ఆదివారం మినుములురు కాఫీ కోలని వద్ద నుంచి వివిధ సంఘాల కార్మికులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి సుందరరావు మాట్లాడుతూ, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కొడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, స్కిం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కాంట్రాక్ట్, ఔట్



మహాసభ ప్రదర్శనలో పాల్గొన్న పోలవరం జిల్లా నాయకులు

సోర్సింగ్ కార్మికులు పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనాలు, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం, థర్డ్‌పార్టీ విధానం రద్దు చేయాలని కోరారు. అనంతరం విశాఖ బహిరంగ సభకు వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాడేరు సిఐటి యు మండల కన్వీనర్..ప్రసాద్, మెడికల్,



పాడేరు నుంచి వెళుతున్న నాయకులు, కార్యకర్తలు

అంగన్వాడీ, కాఫీ, ఆశా, ముఠా, కార్మికులు రత్నాలమ్మ, సుజాత, కాంతమ్మ, చిన్నలమ్మ, కాసులమ్మ, రాజేశ్వరి, మణి, సూరిబాబు, సింహాచలం, శివ, నగేష్, బొజ్జన్న, అధిక మంది కార్మికులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సూత్రా ఫ్యాషన్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలోని హెూటల్ నోవాటెల్ వేదికగా జరుగుతున్న ప్రముఖ జీవనశైలి వస్త్ర ప్రదర్శన సూత్రా – ది ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సోమవారంతో ముగియనుంది. సంక్రాంతి పండుగ వివాహ సీజన్‌ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పొంగల్, వెడ్డింగ్ ఎడిట్ ప్రదర్శన గత రెండు రోజులుగా నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా పేరుగాంచిన డిజైనర్లు, ప్రీమియం లేబుల్స్ తమ ప్రత్యేక ఉత్పత్తులను ఉంచారు. ముఖ్యంగా అనురాగ్ గోల్డ్ జ్యువెల రీ, టెక్నో దర్జీ, సేఫ్టీ పింజ్ వారణాసి, సాఖ్ యూనిక్ క్లోతింగ్, లేబుల్ కవిత, అడోర్నబుల్స్ బై సోనాలి జైన్, యోగితా ఎలిగెంట్, అంకన్ క్రియేషన్ కోల్‌కతా, ట్రెడిషనల్ చికంకారీ లక్నో వంటి ప్రముఖ బ్రాండ్లు తమ సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్స్, ఫ్యాషన్ దుస్తులు ఆభరణాలను ఒకే చోట అందుబాటులోకి తెచ్చాయి. నగరంలోని ఫ్యాషన్ ప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ ప్రదర్శనలో ప్రవేశం ఉచితమని, సోమవారం రాత్రి 9 గంటల వరకు షాపింగ్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పండుగలు, వివాహ శుభకార్యాల కోసం లేటెస్ట్ ఫ్యాషన్ డిజైన్లను అన్వేషించే వారికి ఇది మంచి వేదికని తెలిపారు.


దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన కస్టమర్లు


మాట్లాడుతున్న కుంజా శ్రీను తదితరులు

ఆదివాసీలు ఏజెన్సీ సంపదను కాపాడుకోవాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను

ప్రజాశక్తి-ఎటపాక: ఏజెన్సీ ప్రాంతాల్లో ఖనిజ సంపద దోపిడికి గురవుతోందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎటపాక మండలం పట్టుచీర గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు అమలుకు నోచుకోక హక్కులు దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరు డివిజన్ పరిధిలో అమాయక ఆదివాసులను మభ్యపెట్టి తక్కువ ధరకే గిరిజనేతరులు భూములు కౌలుకు తీసుకుని జామయిల్ సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఎటపాక మండలం గుండాల ఇసుక క్వారీలో జరుగుతున్న అక్రమాలపై ప్రతిరోజు కథనాలు వెలవడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో పాయం భాస్కర్, మడకం రాముడు, మడివి జోగయ్య, కోడి కృష్ణ, సత్యం అంజి తదితరులు పాల్గొన్నారు.

8న మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కూనవరం: నవతరం భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన ఎటపాక మండలం గన్నవరంలో జరిగే శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ డివిజన్ కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం కూనవరంలోని పార్టీ కార్యాలయంలో గన్నవరం ఎంపిటిసి కంతేటిరాజు అధ్యక్షతన జరిగిన డివిజన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముంపు మండలాల డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జా మోహన్‌రావు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఎన్నో భూపోరాటాలు చేసి వందలాది ఎకరాలను పేద గిరిజనులకు పంచిపెట్టిన ఘనత సిపిఐది అని అలాంటి పార్టీ శత జయంతి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ తరలి రావాలనికోరారు.

ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ, తెలం గాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరవు తారన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కటాఫ్ తేదీ 10-10-2022గా నిర్ణయిం చడం వల్ల 18 ఏళ్లు నిండిన చాలామంది నిర్వాసితులు నష్టపోతు న్నారని, ఏ రోజు ప్యాకేజీ ఇచ్చి తరలిస్తున్నారో ఆరోజు వరకు 18 ఏళ్లు నిండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూనవరం మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు, రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్, మహిళ సంఘం అధ్యక్షులు దుర్గ, జుత్తుక సూర్యచంద్రరావు, ఎటపాక కార్యదర్శి ఎలిశాల నాగరాజు, విఆర్‌పురం కార్యదర్శి కర్ణాటి ఏసు, చింతూరు కార్యదర్శి తుర్రం మురళి, సహాయ కార్యదర్శి ఎస్కే రంజాన్, రమణ, సూరం వెంకటేశ్వర్లు, బుడిపిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ డివిజన్ కమిటీ నాయకులు

సావిత్రీబాయి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దేశంలో మొట్టమొదట శిక్షణ పొందిన ఉపాధ్యాయురాలిగా, 200 ఏళ్ల క్రితమే మహిళల కోసం పాఠశాలలు ఏర్పాటు చేసిన సావిత్రీబాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని ఎఐ బిఎస్పీ జాతీయ సమన్వయకర్త, రిటైర్డ్ డిజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. సావిత్రీబాయి పూలే స్మారక అవార్డుల ప్రదాన కార్యక్రమం విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నిజమైన స్వాతంత్ర్యోద్యమం 1848లోనే పాఠశాలల ఏర్పాటుతో మొదలైందని చెప్పారు. అప్పటి వరకు బ్రాహ్మణులకే విద్యాలయాలు ఉండేవని, బ్రాహ్మణ స్త్రీలకు కూడా విద్యాలయాలు ఏమీ లేవని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 200 ఏళ్ల క్రితమే సావిత్రీబాయి పూలే, జ్యోతిబా పూలే అందరికీ విద్యను అందించేందుకు ఇలాంటి కార్యక్రమం చేపట్టారని గుర్తు చెప్పారు. మనమంతా వాళ్లను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.